

నిధుల్లేక.. నీరసిస్తూ..



మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్‌లో ఇళ్ల మధ్యన నిలిచిన మురుగు

- పంచాయతీల్లో ప్రజలు, కార్యదర్శుల అవస్థలు
- ఏడాదిన్నరగా నిలిచిన స్టేట్, సెంట్రల్ ఫైనాన్స్ నిధులు
- గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేక కుంటుపడిన పాలన
- పాలకవర్గాలు కొలువుదీరితేనే 16వ ఆర్థిక సంఘం నిధులు
- సొంత డబ్బులు ఖర్చుచేయలేక, నిధులు రాక చేతులెత్తేస్తున్న పరిస్థితి

పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అంటారు... అలాంటి పల్లెల్లో పాలన పడకేసింది... గ్రామ పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులు అత్యవసరంగా సొంత డబ్బుతో చేసిన ఖర్చులను తిరిగి రాబట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. పైగా వర్షాలు ప్రారంభమయ్యాయి. పారిశుధ్యం పనులు చేపట్టకుండా సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితి ఉంది. ఇదిలా ఉండగా ఉన్నతాధికారులు మాత్రం గ్రామాల్లో రోజువారి పారిశుధ్య పనుల పర్యవేక్షణ ను ముమ్మరం చేశారు. ఈ పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. పాలకవర్గాలు పట్టాలెక్కేవరకైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నిధులు మంజూరు చేస్తేనే పరిస్థితి అదుపులో ఉంటుంది.

మహబూబ్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతూనే ఉన్నది. గతేడాది జనవరిలో పంచాయతీల పాలకవర్గాల గడువు పూర్తికాగా అప్పటి నుంచి పంచాయతీల్లో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతోంది. పాలకవర్గాలు ఉంటే మాత్రమే వచ్చే ఆర్థిక సంఘం నిధులు ఎప్పుడో నిలిచిపోయాయి. కనీస అవసరాలు తీరకపోవడంతో పంచాయతీల్లో పాలన కుంటుపడింది. సొంత డబ్బు ఖర్చుచేయలేక, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం సీజన్‌లో వ్యాధులు ఎక్కువగా ప్రబలే పరిస్థితి ఉంది. దీనికి పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలకం. వాటికి నిధుల అవసరం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఒక్కో కార్యదర్శి ఏడాది కాలంగా రూ. 4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు సొంతంగా ఖర్చు చేశారు. అందులో చిల్లి గవ్వ కూడా ఇప్పటివరకు విడుదల కాలేదు. అయినప్పటికీ వారిపై పని ఒత్తిడితో పాటు ఆర్థిక ఒత్తిడి కూడా తీవ్రమవుతోంది. కేవలం మల్టిపుల్ వర్కర్ల వేతనాలు జీపీ అకౌంట్లలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తోంది. మిగతా నిర్వహణ ఖర్చులు మాత్రం మంజూరు కావడం లేదు. కొత్తగా ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలు కొలువుదీరితేనే 16వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. పాలకవర్గాలు ఉన్న సమయంలో నిధులు రావడం ఆలస్యమైనా సర్పంచులు ముందుగా సొంత డబ్బు ఖర్చు చేసి తర్వాత తీసుకునేవారు. ఇప్పుడాపరిస్థితి లేదు. ఇంకా ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తారనే విషయంలో స్పష్టత లేదు.

విధులు నిర్వహించలేక పోతున్నాం



గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో విధులు నిర్వహించలేకపోతున్నాము. స్వచ్ఛదనం- పచ్చదనం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్కసారి మేజర్ గ్రామ పంచాయతీలకు రూ. 50 వేలు, చిన్న గ్రామ పంచాయతీలకు రూ. 25 వేలు విడుదల చేశారు. ఆ తర్వాత నిధులులేక పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం కష్టంగా మారింది.

- నర్మద, పంచాయతీ కార్యదర్శి, దాచక్‌పల్లి, మహబూబ్‌నగర్

స్టేట్, సెంట్రల్ నిధులు అంతే....

పంచాయతీలకు సాధారణంగా వచ్చే నిధులు మూడు రకాలు. పన్ను రూపంలో వసూలైన మొత్తాన్ని జనరల్ ఫండ్ ద్వారా ఖర్చు చేసుకోవడం, ఆర్థిక సంఘం ద్వారా కేంద్రం నిధులు మంజూరు చేయడం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు రావడం వల్ల పంచాయతీల్లో పనులు జరుగుతాయి. అయితే 2023 మార్చి నుంచి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు మంజూరు కాలేదు. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు నిధులను విడుదల చేస్తారు. ఒక్కో వ్యక్తికి సంవత్సరంలో రూ. 1680 చొప్పున అందజేయాల్సి ఉంటుంది. వనపర్తి జిల్లాలో ఎస్ ఎఫ్‌సీ నుంచి రూ. 22.74 కోట్లు ఇప్పటివరకు నిధు లు పెండింగ్‌లో ఉండగా, 16వ ఆర్థిక సంఘం నుంచి రూ.21.49 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గద్వాల జిల్లాలో 16వ ఆర్థిక సంఘం

- మిగతా 6లో..

పబ్లిక్ స్కూల్‌గా వంగూరు జడ్పీహెచ్ఎస్

6

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్



మాట్లాడుతున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం వనపర్తి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో పని చేసే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని తెలిపారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారికి న్యాయం చేయాలని సూచించారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే అక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. విధుల్లో బాధ్యతగా పనిచేసినప్పుడే తమకు గుర్తింపు వస్తుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురిని సన్మానించారు. సమావేశంలో డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, సీఐ కృష్ణయ్య, ఆత్మకూరు సీఐ శివకుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, డీసీఆర్‌బీ ఎస్ఐ రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా నీటి విడుదల?

- నిండుకుండలా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు

6



జూరాల ఎడమ కాలువ

డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి



నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్, డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రతీ అధ్యాపకుడు బోధనా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు, మౌలిక వసతులు, బోధనా సౌకర్యాలు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో ఈ తరహా సమీక్షా సమావేశం నిర్వహించడం రాష్ట్రంలోనే ఇది మొదటిదని అన్నారు. జిల్లాలోని ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను యూనివర్సిటీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు కళాశాల ప్రిన్సిపాల్ మదన్ మోహన్ బాలకిష్టారెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

భూ సమస్యల పరిష్కారానికే.. రెవెన్యూ సదస్సులు

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

వంగూరు, జూన్ 12, (ఆంధ్రజ్యోతి) భూ భారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యలపై వచ్చిన ప్రతీ దరఖాస్తుకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. భూములపై పూర్తి హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ మురళీ మోహన్ తదితరులు ఉన్నారు.

మోగిన.. బడిగంట

ఆంధ్రజ్యోతి విజిట్



కొల్లాపూర్ మండలం సింగోటం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పూలతో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు

- సింగోటం పాఠశాలలో విద్యార్థులకు పూలతో స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- తొలి రోజే దుస్తులు, పుస్తకాలు అందజేత
- వనపర్తి పట్టణంలోని సాయినగర్, బిజయ్యనగర్ పాఠశాలల్లో అందించని మధ్యాహ్న భోజనం
- మానవపాడు మండలంలో తెరుచుకోని శ్రీనగర్ ప్రాథమిక పాఠశాల
- 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెలుగులోకి



అందంగా అలంకరించిన సింగోటం ప్రాథమిక పాఠశాల



గద్వాల పట్టణంలోని దౌదర్‌పల్లి పాఠశాల ఆవరణలోకి చేరిన వర్షపు నీరు



అమరచింత పాఠశాలలో ప్రార్థనకు హాజరైంది ఐదుగురు విద్యార్థులే

రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 23 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మూగబోయిన బడిగంట ఈ నెల 12న మోగింది. ఇందులో భాగంగా వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గురువారం పాఠశాలలు పునఃప్రారంభించారు. ఆయా జిల్లాల్లోని పాఠశాలలను మామిడి తోరణాలతో అలంకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ మండలం సింగోటం పాఠశాలను అందంగా ముస్తాబు చేశారు. అంతే కాకుం డా ఉపాధ్యాయులు విద్యార్థులపై పూలవర్షం కురిపిస్తూ పాఠశాలలోకి ఆహ్వానించారు. గద్వాల జిల్లాలోని మానవపాడు మండలం, శ్రీనగర్ ప్రాథమిక పాఠశాలకు తాళం తీయ లేదు. వనపర్తి పట్టణంలోని సాయినగర్, బిజయ్యనగర్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారు.

6

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం

- రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా తయారు చేయడమే హాకీ అకాడమీ లక్ష్యమని రాష్ట్ర ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్ అన్నారు. గురువారం వనపర్తి పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో హాకీ అకాడమీలో ఖాళీల భర్తీ కోసం ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ కుమార్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సురేందర్‌రెడ్డితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు.

జూరాలకు నిలకడగా వరద

- ప్రారంభమైన విద్యుత్ ఉత్పత్తి



జూరాల జలాశయం

6

గద్వాలలో భారీ వర్షం

జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 73 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు


నాగర్‌కర్నూల్ టౌన్/వనపర్తి/గద్వాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. జిల్లాలోని కల్వకుర్తి మండలంలో అత్యధికంగా 68.0 మిల్లీ మీటర్ల వర్షం కురువగా అత్యల్పంగా లింగాల మండలంలో 2.6 మిల్లీ మీటర్లు కురిసింది. తెల్కపల్లి మండలంలో 65.6 మిల్లీ మీటర్లు, పెద్దకొత్తపల్లిలో 64.2, నాగర్‌కర్నూల్‌లో 53.8, కోడేరులో 43.6, పెంట్లవెల్లిలో 42.8, వెల్దండలో 42.0 తాడూరులో 41.0, అమ్రాబాద్‌లో 38.2, బిజినేపల్లిలో 36.2, చారకొండలో 34.2, ఊర్కొండ, అచ్చంపేటల్లో 28.6, బల్మూరులో 23.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. మిగతా మండలాల్లో 12.6 మిల్లీ మీటర్ల నుంచి 21.4 మిల్లీమీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది.

వనపర్తి జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. గత 10 రోజులుగా వర్షాలు లేక దిగాలు చెందిన రైతులు భారీ వర్షం కురవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికే ఆత్మకూరు, అమరచింత మండలాల్లోని రైతులు పత్తి విత్తనాలు నాటారు. జిల్లాలో అత్యధికంగా వనపర్తిలో 59.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా చిన్నంబావిలో 3.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

గద్వాలలో..

జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 73 మిల్లీ మీటర్ల వర్షం కురవడంతో వాగులు వంపులు పొంగి పొర్లాయి. మల్దకల్ మండలంలో 62.8, గట్టులో 58, గద్వాలలో 56, రాజోలిలో 55.8, అయిజలో 48.8, వడ్డేపల్లిలో 47.8, ధరూర్‌లో 30.2, కేటీదొడ్డిలో 24.9, ఉండవెల్లిలో 26.7, అలంపూర్‌లో 10.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో రైతులు విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు.

ముందస్తుగా నీటి విడుదల?


నిండుకుండలా మారిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు


ఎడమ కాలువ గేట్లు మూసివేసిన దృశ్యం

- నిండుకుండలా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు
- కుడి, ఎడమ కాలువల ఆయకట్టు రైతుల ఆనందం
- 1.10 లక్షల ఎకరాలకు పైగా సాగుకు అవకాశం
- వెంటనే నీరిస్తే ఇబ్బంది లేకుండా రెండో పంట పూర్తి

ఆత్మకూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాకు వర ప్రదాయినిగా నిలిచిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నది. ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో నిండు కుండలా మారిన జలాశయం ఆయకట్టు రైతుల్లో ఆశలు నింపుతోంది. గత ఏడాది జూలై మూడవ వారంలో జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద మొదలయ్యింది. నాలుగో వారానికి ప్రాజెక్టు నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది అందుకు భిన్నంగా ఎగువనున్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో మే రెండవ వారంలోనే అత్యధికంగా వర్షాలు కురిశాయి. దీంతో జూరాల ప్రాజెక్టుకు వరద మొదలయ్యింది. మే చివరి వారంలోనే నీటి నిల్వ గరిష్ఠ స్థాయికి చేరుకుంది. దీంతో ప్రాజెక్టు అధికారులు ముందస్తుగానే నీటిని నీటి విడుదల చేసి ఆదుకుంటారని కుడి, ఎడమ కాలువల పరిధిలోని ఆయకట్టు రైతులు ఆశిస్తున్నారు.

గత ఏడాది జూలైలో నీటి విడుదల

గత ఏడాది జూలై చివరి వారంలో ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు ఆలస్యంగా నార్లు పోసుకున్నారు. ఆగస్టు రెండు, మూడు వారాల్లో నాట్లు వేసి డిసెంబర్ చివరి వారం వరకు పంటల కోత పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో రెండవ పంటకు జనవరి, ఫిబ్రవరి మాసాలలో నాట్లు ప్రారంభించారు. దీంతో చివరి వారానికి పంట కోతకు వచ్చింది. కానీ అప్పటికే ప్రాజెక్టులో నీరు తగ్గిపోయి సాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు అధికారులు ఇదే వారంలో నీటిని విడుదల చేస్తే రైతులు వర్షాకాలం పంటను ముందుగానే పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది.

నీటి విడుదలకు ఎదురు చూపులు

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల పరిధిలో 1.10 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఎడమ కాలువ పరిధిలో అమరచింత మండలం మొదలుకొని, ఆత్మకూరు, మదనాపూర్, కొత్తకోట, పెబ్బేరు, శ్రీరంగాపూర్, వీపనగండ్ల, చిన్నంబావి, నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెంట్లవెల్లి మండలం వరకు 76 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. కుడి కాలువ పరిధిలో 36 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ఎగువ నుంచి ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతోంది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి కూడా ప్రతీ రోజు 10 నుంచి 20 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో రైతులు నార్లు పోసుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రాజెక్టు అధికారులు స్పందించి ముందుగానే నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరు తున్నారు.

ఈనెల మూడో వారంలో నాట్లు



ఈ నెలాఖరు వరకు నీరు విడుదల చేస్తే నార్లు పోసుకుని, వచ్చే నెల మూడో వారంలో నాట్లు వేసుకునే అవకాశం ఉంటుంది. బీపీటీ సన్న రకం వరి పండించే రైతులకు అనుకూలమైన కార్తెలు ఈ నెలాఖరు వరకే ఉన్నాయి. కాబట్టి ఎడమ కాలువ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలి. ప్రధాన ఎడమ కాలువకు డి-6 కాలువ అనుసంధానంగా ఉంది. దాని ద్వారా సాగునీటిని విడుదల చేసుకుని ముందుగానే నార్లు పోసుకునే అవకాశం ఉంది. కావునా ప్రాజెక్టు అధికారులు గుర్తించి నీటిని విడుదల చేయాలి.

- మాసన్న, గుంటిపల్లి

సాగు నీరు విడుదల చేయాలి



ముందుగానే కాలువలకు సాగునీటిని విడుదల చేస్తే రైతులు వచ్చే నెల ఆఖరు వరకు నాట్లు ముగించుకుంటారు. దీంతో రెండో పంటను ముందుగానే సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. ఏప్రిల్ మాసంలో తాగునీటికి కూడా ఇబ్బందులు ఎదురుకావు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే నీటి విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

- ఎల్లన్న, మూలమల్ల

ఈనెల 20 తర్వాత నీటి విడుదల



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. సాగునీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతుల నుంచి ఒత్తిడి వస్తోంది. ఈ విషయాన్ని సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులకు విన్నవిస్తాం. వారి ఆదేశం మేరకు ఈనెల 20 తరువాత సాగునీటి విడుదలకు ఆదేశాలు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

- జగన్మోహన్, జూరాల ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

ముమ్మరంగా 100 రోజుల ప్రణాళిక

- పరిశీలించిన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ జేడీ నారాయణరావు


కల్వకుర్తి పట్టణంలో చేపట్టిన పనులను పరిశీలిస్తున్న జేడీ నారాయణరావు, మునిసిపల్ కమిషనర్

కల్వకుర్తి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలో వంద రోజుల పట్టణ ప్రణాళిక మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ ఆధ్వర్యంలో ముమ్మరంగా కొనసాగుతుంది. అందులో భాగంగా కొనసాగుతున్న పనులను గురువారం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు పరిశీలించారు. పార్కులను, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిపొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన ఆటోలకు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఆయన డీఆర్‌సీసీని సందర్శించారు. తర్వాత మునిసిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీలో పన్నులు వంద శాతం వసూలయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ షబ్బీర్ మహమ్మద్, మేనేజర్ రాజకుమారి నోరి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, వార్డు ఆఫీసర్లు, మహిళా సంఘాల సభ్యులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

మల్దకల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలం అడవి రాముల చెరువు గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పెద్దకృష్ణన్న, అక్కమ్మ దంపతుల కుమారుడు నాగరాజు మంగళవారం రాత్రి భోజనం చేసి పొలానికి వెళ్లి నిద్రపోయాడు. బుధవారం ఉదయం తండ్రి పొలం వదకు వెళ్లి చూడగా, అపస్మారకస్థితిలో పడిపోయి కనిపించాడు. ఆందోళనకు గురైన తండ్రి అతడిని హుటాహుటిన ఏపీలోని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. సంఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నందీకర్ తెలిపారు.

పబ్లిక్ స్కూల్‌గా వంగూరు జడ్పీహెచ్‌ఎస్

- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, కలెక్టర్ బదావత్ సంతోష్


విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న విద్యా కమిషన్ చైర్మన్ మురళీ, కలెక్టర్ బదావత్ సంతోష్

వంగూరు, జూన్ 12, (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని వంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఎల్‌కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఈ విద్యాసంవత్సరం నుంచే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో గురువారం 30 మంది విద్యార్థుల తల్లిదండ్రులతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో విద్యా కమిషన్ చైర్మన్ మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సేకరించిన అభిప్రాయాలు, సిఫారుసలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఎంత ఖర్చు చేసేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్‌స్కూల్ అభివృద్ధికి కమిటీ సభ్యులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని సామాజిక బాధ్యతగా భావించి కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కమిషన్ సభ్యులు, విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి, డీఈవో రమేశ్, డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్, డీఆర్‌డీవో చిన్న ఓబులేశ్, ఆర్డీవో శ్రీను, మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, ఎంఈవో మురళీమోహనాచారి పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

వెల్దండ (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేశ్, ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు అన్నారు. వెల్దండ మండల పరిధిలోని కొట్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రార్థన సమయంలో కేవలం ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయకపోతే ప్రభుత్వ పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రేమకుమారి ఉన్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

- ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేశ్‌కుమార్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జూన్ 12, (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఔషధ నియంత్రణ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ దినేశ్‌కుమార్ హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 ఔషధ దుకాణాల్లో గురువారం ఆయన నేతృత్వంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రిస్క్రిప్షన్, బిల్లులు లేకుండా యాంటిబయోటిక్స్ విక్రయిస్తున్న 17 దుకాణాలను గుర్తించి, షోకాజ్ నోటీసులను జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మందుల దుకాణాల్లో చాలా వరకు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. యాంటిబయోటిక్స్ విక్రయిస్తూ, బిల్లులు నిర్వహించడం లేదని చెప్పారు. ఎవరైనా సరే అనుమతులు లేకుండా మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నోటీసులు అందుకున్న వారి సమా ధానాల ఆధారంగా తదుపతి చర్యలు ఉంటాయని చెప్పారు. తనిఖీల్లో ఉమ్మడి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు రఫీ, రబియా, రష్మి, విశ్వంత్‌రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


మందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

నిధుల్లేక నీరసిస్తూ..

(5వపేజీ తరువాయి)

నుంచి రూ. 32 కోట్లు విడుదలకావాలి. స్టేట్‌ఫైనాన్స్ నుంచి రూ. 16 కోట్ల వరకు మ్యాచింగ్ గ్రాంటు పెండింగ్‌లో ఉన్నది. నారాయణపేట జిల్లాలో 2024 జూలై నుంచి రూ. 6.88 కోట్లను మాత్రమే ఎంపీడబ్ల్యూ వేతనాలు, సీసీ చార్జీలు, ఆపరేటర్ వేతనాలు, ట్రాక్టర్ల ఈఎంఐ చెల్లించడానికి జమ చేశారు. 16వ ఆర్థిక సంఘం, ఎస్‌ఎఫ్‌సీ నిధులు పెండింగ్‌లోనే ఉన్నాయి. సర్పంచుల పదవీకాలం పూర్తయినప్పటి నుంచి నిధులు పెండింగ్‌లో పడిపోయాయి. ప్రతీ సంవత్సరం ఇచ్చే నిధులను ఐదు శాతం పెరగాల్సి ఉండగా పెండింగ్ నిధులే రాని పరిస్థితులు ఉన్నాయి. దీంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయడం, సామగ్రి కొనుగోలు చేయడం, ట్రాక్టర్ డీజిల్, నిర్వహణ, వీధి దీపాలు, మంచినీటి నిర్వహణలో భాగంగా పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ల మరమ్మతులు, కొత్త మోటార్లు తేవడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాల ఖర్చు తడిసిమోపెడవుతోంది.

పర్యవేక్షణ సరే పనులెలా...

జిల్లాల వారీగా పంచాయతీలు...	
మహబూబ్‌నగర్	441
నారాయణపేట	280
జోగుళాంబ గద్వాల	255
నాగర్‌కర్నూలు	453
వనపర్తి	255

ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం చెత్త సేకరణ సమాచారం తెలుసుకునేందుకు తీసుకువచ్చిన డైలీ శానిటేషన్ రిపోర్టు (డీఎస్‌ఆర్)యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేందుకు పంచాయతీ కార్యదర్శులు ఎట్టకేలకు అంగీరించారు. ఈ మేరకు బుధవారం రాత్రి హైదరాబాద్‌లో పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులతో రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. దీంతో ఇప్పటికే మహబూబ్‌నగర్ జిల్లాలోని 423 గ్రామ పంచాయతీలకు గాను 421 గ్రామ పంచాయతీలలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. కానీ నిధులే లేనప్పుడు ప్రతీ రోజు పారిశుధ్య పనులు ఎలా చేపట్టాలనే ఆందోళన కార్యదర్శులను వేధిస్తోంది. డీఎస్‌ఆర్ యాప్‌లో ఫేస్ రికగ్నైజ్ రిజిస్ట్రేషన్ యాప్ ప్రధానం. దాన్ని డౌన్‌లోడ్ చేసుకున్న కార్యదర్శులు డీఎస్‌ఆర్ యాప్ మొత్తాన్ని డౌన్‌లోడ్ చేసుకునేందుకు విముఖత చూపుతున్నారు. ఇప్పటివరకు తమ సొంత మొబైల్స్‌లో శానిటేషన్ రిపోర్ట్‌ను అప్‌లోడ్ చేశారు. డీఎస్‌ఆర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే సమాచారం మొత్తం రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఉంటుందని వారు ఆందోళన చెందుతున్నారు.

పాలక వర్గంలేక పనిభారం అధికం



గ్రామాలలో పాలక వర్గాలు లేకపోవడం వల్ల పంచాయతీ కార్యదర్శులపై అదనపు పని భారం పడుతోంది. ప్రభుత్వం గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. దీంతో పంచాయతీలు ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామాలలోని ప్రజల ఒత్తిడి మేరకు అందిన చోట అప్పులు తెచ్చి పనులు చేపట్టాం. ఇకపై పనులు నిర్వహించే ఆర్థిక స్తోమత కార్యదర్శులకు లేదు. ప్రభుత్వం ఇప్పటికైన నిధులు విడుదల చేయాలి.

- శివప్రసాద్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

డీజిల్‌కు డబ్బులు లేవు

గ్రామ పంచాయతీలలో డీజిల్ పోయడానికి డబ్బులులేక ట్రాక్టర్లను ఆపివేశాం. పరిస్థితి అధ్వానంగా ఉన్నది. ఆర్థికపరమైన పనులు చేయబోమని అధికారులకు చెప్పేశాం. వచ్చేది వర్షాకాలం పారిశుధ్య పనులకు నిధులు లేవు. పంచాయతీ కార్యదర్వులు వత్తిడిలో ఉన్నారు.

- ఖాజామీర్, అధ్యక్షుడు, పంచాయతీ కార్యదర్శుల సంఘం, గద్వాల జిల్లా

మోగిన బడి గంట



లింగుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ నారాయణపేట/ వనపర్తి విద్యావిభాగం/ గద్వాల సర్కిల్/ నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవులు ముగిశాయి. బడిగంట మోగింది. ఇన్ని రోజులు ఆడి, పాడిన విద్యార్థులు పాఠశాల బాట పట్టా రు. విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తెరుచుకున్నాయి. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. పాఠశాలల్లో పండుగ వాతావరణం కనిపించింది. ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తరగతి గదులకు మామిడి తోరణాలు, బెలూన్లను కట్టి విద్యార్థులకు స్వాగతం పలికారు. విద్యార్థులకు మొదటి రోజే పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. కానీ కొన్ని పాఠశాలలకు నేటికీ దుస్తులు చేరలేదు. కానీ కొన్ని పాఠశాలలకు తాళం తీయలేదు. మరి కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనమే వండలేదు.

సమయానికి తెరచుకోని పాఠశాలలు

మహబూబ్‌నగర్ అర్బన్ మండలంతో పాటు, పలు మండలాల్లోని పలు పాఠశాలలు సమయానికి తెరుచుకోలేదు. దొడ్డలోనిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు రాకపోవడంతో పాఠశాలను తెరువలేదు. వచ్చిన విద్యార్థులు ఆరుబయట వేచి ఉండాల్సి వచ్చింది. మరికొన్ని పాఠశాలలు అర గంట ఆలస్యంగా తెరుచుకున్నాయి. కొన్ని పాఠశాలల్లో మొదటి రోజు కావడంతో విద్యార్థులు ఎంత మంది వస్తారో తెలియక వంట ఆలస్యంగా చేశారు. దీంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఆలస్యంగా వడ్డించారు. చాలా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. పాఠశాల విశిష్టతలను వివరించారు. విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. కోయిలకొండ మండల పరిధిలోని లింగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో డీఈవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. విద్యా ర్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు.

అద్దె భవనంతో అవస్థలు

నారాయణపేట పట్టణంలోని శివాజీనగర్ ప్రాంతంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నది. బడిలో 354 మంది విద్యార్థులున్నారు. గదుల కొరత ఉండటంతో 6, 7 తరగతులు ఇంగ్లీష్, తెలుగు మీడి యం, 8వ తరగతి తెలుగు మీడియం తరగతులను లాల్ మజ్జీద్ పాఠశాలలో నిర్వహిస్తున్నారు. దీంతో రోడ్డుపైనే విద్యార్థులు ప్రార్థన చేశారు. మొత్తం 14 మంది ఉపాధ్యాయుల్లో పది మంది ప్రార్థన సమయానికి వచ్చారు. మిగిలిన వారు ఆలస్యంగా వచ్చారు. విద్యార్థులు 50 మందే వచ్చారు. నారాయణపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో తరగతి గదుల కొరత ఉంది. తొమ్మిది తరగతులకు ఆరు గదులే ఉన్నాయి. తొమ్మిది మంది టీచర్లు ఉన్నారు. వారు కొత్త విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుంటూ కనిపించారు. పాఠశాల పరిసరాల్లో వర్షం నీరు నిలవడంతో ఇబ్బందులు పడ్డారు. తొలి రోజు పలు మండలాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల కంటే ఉపాధ్యాయులే ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 51,591 మంది విద్యార్థులకు గాను, 12,127 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు.

30 నుంచి 40 శాతం హాజరు

వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి రోజు 30 నుంచి 40 శాతం మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 2,050 మంది ఉపాధ్యాయులు బడులకు హాజరయ్యారు. మొదటి రోజు కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సర్కారు బడిలో అందించే నాణ్యమైన విద్య, కల్పించే సౌకర్యాలపై అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలోని సాయినగర్, బజయ్యనగర్, ప్రాథమిక పాఠశాలలో వంట మనుషులు రాకపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించలేదు.

- గద్వాలలోని ప్రభుత్వ ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో 960 మంది విద్యార్థులకు గాను 102 మంది హాజరయ్యారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1,130 మందికి గాను 167 మంది, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 960 మంది విద్యార్థినులకు 240 మంది వచ్చారు. దౌదర్‌పల్లి ఎంపీహెచ్‌ఎస్‌లో 215 మంది విద్యార్థులకు గాను 63 మంది హాజరయ్యారు. అలంపూరు నియోజకవర్గం, ఉండవల్లి మండలంలోని బొంకూరు ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో గతేడాది 410 మంది విద్యార్థులు ఉండగా, తొలి రోజు 48 మంది మాత్రమే హాజయ్యారు. మానవపాడు మండలం, శ్రీనగర్ ప్రాథమిక పాఠశాలలో గతేడాది కేవలం 7 గురు విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులను సంఖ్యను పెంచాలని అధికారులు ఆదేశించారు. కానీ ఆ పాఠశాల తాళం కూడా తీయలేదు. రాజోలి మండలం, పచ్చర్ల పాఠశాలలో మొదటి రోజు విద్యార్థులు పుస్తకాలు మోస్తూ 'ఆంధ్రజ్యోతి' కంటపడ్డారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు మొదటి రోజు విద్యార్థులు అంతంతమాత్రంగానే హాజరయ్యారు. వారికి ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. కొల్లాపూర్ మండలంలోని సింగోటం ప్రాథమిక పాఠశాలను చమ్కీ, మామిడి తోరణాలు, పూలతో ముస్తాబు చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణం అంతా పండుగ వాతావరణం కనిపించింది. విద్యార్థులకు పూలబాట వేసి, ఎంఈవో, పాఠశాల ఉపాధ్యాయులు పూలు చల్లుతూ విద్యార్థులను ఆహ్వానించారు.


పాలమూరు పట్టణంలోని బీపీహెచ్‌ఎస్ అవరణలో నిలిచిన వర్షం నీరు

జూరాలకు నిలకడగా వరద

- ప్రారంభమైన విద్యుత్ ఉత్పత్తి

ధరూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్థిరంగా, నిలకడగా కొనసాగుతోంది. దీంతో రెండు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువన ఉన్న ఆల్మట్టి జలాశయంలో 60 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, నారాయణపూర్ జలాశయంలో నీటి నిల్వ 29 టీఎంసీలకు చేరుకున్నది. ప్రస్తుతం జలాశయంలో నీరు 318.070 మీటర్ల మేర, 5.043 టీఎంసీలకు నీరు నిల్వ ఉంది. గురువారం 14,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదయ్యింది. అందులో నుంచి జలవిద్యుత్ కేంద్రానికి 7.469 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రెండు యూనిట్ల ద్వారా 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 1,500, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 312, మొత్తంగా ప్రాజెక్టు నుంచి 9,352 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టులో 56 టీఎంసీల నీటి నిల్వ

దోమలపెంట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాక్టుకు ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పాదన 7,438 క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుండి 2,215 క్యూసెక్కులు, మొత్తంగా 9,653 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుండగా శ్రీశైలం ప్రాజెక్టులోకి 14,241 క్యూసెక్కుల వరద నీరు చేరుతుండగా, గురవారం శ్రీశైలం ప్రాజెక్టు నిల్వలు ఈవిధంగా ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 836.50 అడుగులకు చేరగా, 215.807 టీఎంసీల సామర్థ్యానికి గాను 56.8886 టీఎంసీల నీటి నిల్వలు నమోదు అవుతున్నట్లు డ్యాం గేజింగ్ అధికారులు పేర్కొంటున్నారు. గడిచిన 24 గంటల వ్యవధిలో కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో 1,878 క్యూసెక్కు నీటి వినియోగించి 0.913 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 5,604 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 2.593 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగించగా, శ్రీశైలం ప్రాజెక్టు నుండి 8,417 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పాదనతో సాగర్‌కు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొన్న వోల్వో బస్సు

» 18 మందికి గాయాలు


తలకు గాయమైన ప్రయాణికురాలు

మక్తల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని వోల్వో బస్సు ఢీకొనడంతో 18 మందికి గాయాలైన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం బొందల్‌కుంట సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకున్నది. కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న దుర్గమ్మ ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు గురువారం ఉదయం 6 గంటల సమయంలో బొందల్‌కుంట స్టేజీ సమీపంలో జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 32 మందిలో 18 మందికి గాయాలయ్యాయి. డ్రైవర్ సంజీవ్ రెండు కాళ్లు విరిగాయి. మౌమినాకౌసర్ అనే మహిళ తలకు, గీత అనే మహిళ వెన్నెముకకు తీవ్రగాయాలు అయ్యాయి. అలాగే అన్నపూర్ణ, రమేష్, గౌరు నర్సింహలకు గాయాలయ్యాయి. మిగతా 12 మందికి స్వల్పగాయాలు అయ్యాయి. క్షతగాత్రులకు మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉన్నవారిని మహబూబ్‌నగర్‌కు తరలించారు. నడిరోడ్డుపై లారీ ఆగి ఉండటంతో వేగంగా వచ్చిన బస్సు ఢీకొనడంతో ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో బస్సులోంచి బయటకు దిగడానికి వీలు లేకుండా పోయింది. దీంతో కిటికీల నుంచి బస్సులో ఉన్న ప్రయాణికులను స్థానికులు బయటకు తీశారు. గాయపడ్డ ప్రయాణికులందరూ కర్ణాటకలోని శివమొగ్గకు చెందిన వారుగా గుర్తించారు. జిల్లా ఎస్పీ యోగేష్‌గౌతమ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాంలాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

రహదారి ధ్వంసం కేసులో

దోషికి 6 నెలల జైలు

గద్వాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో ఉన్న రహదారిని ధ్వంసం చేసిన కేసులో ఓ వ్యక్తికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించి జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాస్‌రావు, డీఎస్పీ మొగిలయ్య, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల మండలం అనంతాపురం స్టేజీ నుంచి ఇటిక్యాల మండలం వరకు 2018లో ఆర్ అండ్ బీ శాఖ రహదారి నిర్మాణాన్ని చేపట్టింది. అనంతపురం గ్రామానికి చెందిన ఎస్ విష్ణువర్ధన్‌రెడ్డి తన పొలం మీదుగా రోడ్డు వేయరాదని పనులను అడ్డుకున్నాడు. అప్పటికే వేసిన మట్టి రోడ్డును 4 కిలోమీటర్ల మేర ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశాడు. ఆ మట్టిని ట్రాక్టర్‌లో తరలించాడు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మణ్‌కుమార్ అదే సంవత్సరం జనవరి 5వ తేదీన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఏ-1 ఎస్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏ-2 ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ డ్యాగ నరేశ్‌కుమార్, ఏ-3 బజారన్న, ఏ-4 ట్రాక్టర్ డ్రైవర్లపై డొంగుల నరేశ్‌లపై అప్పటి ఎస్ఐ అంజాద్ ఆలి కేసులు నమోదు చేసి, జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించారు. కేసుపై మహబూబ్‌నగర్ కోర్టులో విచారణ జరిగింది. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం నిందితుడిపై నేరం రుజువైనందున విష్ణువర్ధన్‌రెడ్డికి 6 నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమాన విధిస్తూ మొదటి ఏడీజే కోర్టు న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. నేరస్థుడికి జైలు శిక్ష పడేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిరణ్‌కుమార్‌రెడ్డికి కోర్టు లైజనింగ్ ఎస్ఐ నర్సింహులు సహకరించారు. విచారణ సందర్భంగా కోర్టులో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టిన సీఐ టంగుటూరి శ్రీను, ఎస్ఐ శ్రీకాంత్‌లను ఎస్పీ అభినందించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మల్దకల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : తెగిపడిన విద్యుత్ తీగను తగిలి విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలంలోని పావనంపల్లె గ్రామంలో గురువారం ఈ సంఘటన జరిగింది. మల్దకల్ ఎస్ఐ నందీకర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పరశురాముడు అనే వ్యక్తి ఇంటి వద్ద విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. గురువారం ఉదయం విద్యుత్ తీగను గమనించకుండా తగలడంతో అతడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య శారదమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

ధరూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండల పరిధిలోని ఖమ్మంపాడు గ్రామంలో ఓ యువతి (19) అదృశ్యం అయ్యింది. హెడ్‌కానిస్టేబుల్ హుస్సేన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆ యువతి ఈ నెల 11న, బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి వరకు కూడా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఉదయం ఆమె తండ్రి ధరూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు హెడ్‌కానిస్టుబుల్ తెలిపారు.

శత వసంతాల పాఠశాల


బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ ప్రాంగణంలో 25 సంవత్సరాల క్రితం నిర్మించిన స్టేజీ

» 1925లో ఏర్పాటైన బాదేపల్లి జడ్పీహెచ్ఎస్
» ఉర్దూ మీడియంతో ప్రారంభమైన బడి
» ఈ విద్యాసంవత్సరంలో శతాబ్ది ఉత్సవాలు

జడ్చర్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, బాదేపల్లి బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఈ విద్యా సంవత్సరానికి వందేళ్లు పూర్తి చేసుకొని 101 సంవత్సరంలోకి అడుగు పెట్టింది. పట్టణంలోని ధర్మశాలలో ఉర్దూ మీడియం పాఠశాలగా ప్రారంభమయ్యింది. ప్రస్తుతం మూడు మాధ్యమాలతో ఉన్నత పాఠశాలగా కొనసాగుతోంది. రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థులున్న పాఠశాలగా పేరు పొందింది. వంద సంవత్సరాలలో వేలాది మందికి విద్యాబుద్ధులు నేర్పిన ఈ పాఠశాల ఇప్పుడు (2025-26 విద్యాసంవత్సరం) 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ నేపథ్యంలో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు ఇప్పటికే సన్నాహాలను ప్రారంభించారు.

ధర్మశాలలో పాఠశాల ప్రారంభం

జడ్చర్ల పట్టణంలో గంజ్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలోని ధర్మశాలలో 1925వ సంవత్సరంలో ఉర్దూ మీడియం పాఠశాలగా ప్రారంభం అయ్యింది. ఆ తర్వాత తెలుగు మీడియంలోనూ విద్యాబోధన ప్రారంభించారు. స్వాతంత్రానంతరం 1949 - 50లో మాధ్యమిక పాఠశాలగా మారింది. అప్పుడు ధర్మశాలలో ఉన్న బడిని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో 4 ఎకరాలలో నిర్మించిన నూతన భవనంలోకి మార్చారు.

1952 నుంచే ఉన్నత తరగతులు ప్రారంభమైనా, అధికారికంగా 1956 - 57 విద్యా సంవత్సరంలో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. 1985-86లో ఒకేషనల్ విద్యను ప్రారంభించారు. విద్యార్థులు స్వయంఉపాధి సాధించుకునేలా పాఠశాల వి ద్యాభ్యాసంలోనే కంప్యూటర్ విద్యతో పాటు ప్లంబింగ్, టైలరింగ్, బుక్‌బైండింగ్ తరగతులను నిర్వహిస్తున్నారు. 2009-10 విద్యా సంవత్సరంలో ఇంగ్లీష్ మీడియం తరగతులను ప్రారంభించారు.

ప్రస్తుతం మూడు ఉర్దూ, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో విద్యాబోధన కొనసాగుతోంది.

27 సెక్షన్లు, 1,100 మంది విద్యార్థులు

ధర్మశాలలో ప్రారంభమైన ఈ పాఠశాల అంచెలంచెలుగా ఎదుగుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా మారింది. ఇప్పటివరకు ఇక్కడ వేలాది మంది విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. పాఠశాల అభివృద్ధికి జడ్చర్ల మొట్టమొదటి ఎమ్మెల్యే కొత్తకేశవులు ఎంతో కృషి చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే అత్యధిక మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఇది ఒకటిగా ఉంది. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు దాదాపు 1100 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. 27 సెక్షన్లు కొనసాగుతున్నాయి.

ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు

బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఈ సంవత్సరం ఘనంగా నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు సన్నాహాలు చేస్తున్నారు. విద్యాసంవత్సరాల వారీగా పూర్వవిద్యార్థులు కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. శతాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ప్రణాళికను రూపొందించి కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. సావనీర్‌ను తయారు చేయడం, పాఠశాల భవనాలకు రంగులు వేయించడం, ప్రధానద్వారం వద్ద ఆర్చి ఏర్పాటు తదితర అంశాలపై దృష్టి సారిస్తున్నారు.

క్రీడల హబ్‌గా మహబూబ్‌నగర్

» ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్
» ఉత్సాహంగా వాలీబాల్ అకాడమీ ఎంపికలు


సమావేశంలో మాట్లాడుతున్న ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాను క్రీడల హబ్‌గా తీర్చిదిద్దుదామని ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్‌పి వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇన్‌డోర్ స్టేడియంలో గురువారం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) వాలీబాల్ అకాడమీ అండర్-16 బాల, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎన్‌పీ వెంకటేశ్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడలకు మంచి రోజులు రానున్నాయన్నారు. జిల్లావాసులు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి నాలుగు స్తంభాలుగా ఉన్నారని తెలిపారు. దీంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని గుర్తు చేశారు. ఇటీవలే మక్తల్‌కు చెందిన క్రీడాకారిణి అనన్య భారత మహిళ వాలీబాల్ జట్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. క్రీడాభివృద్ధికి ఒలింపిక్ అసోసియేషన్ పూర్తి సహకారం అందిస్తోందన్నారు. అనంతరం అండర్-16 బాల, బాలికల విభాగంలో ఎంపికలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 49 మంది బాలురు, 23 మంది బాలి కలు హాజరయ్యారు. శాట్ పర్యవేక్షకులు, సీనియర్ కోచ్‌ల పర్యవేక్షణలో ఎంపిక పరీ క్షలు, పోటీలు నిర్వహించారు. ఎత్తు, షటిల్ రన్, సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. వాలీబాల్ క్రీడలో నైపుణ్యాన్ని పరీక్షించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, ప్రవీణ, కృష్ణ ప్రసాద్, సందీప్, సంపత్, రుశిద్ర, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, వాలీబాల్ అసోసియేషన్ ఆర్గ నైజింగ్ సెక్రటరీ చెన్న వీరయ్య, సూపరింటెండెంట్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా టీజీ పీయూ సెట్

» ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం
» పీయూలో కొనసాగుతున్న టీజీ పీఈసెట్ ఎంపికలు
» తొలి రోజు 544 మందికి గాను 370 మంది హాజరు


ఎంపికలను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, శ్రీరామ్ వెంకటేశ్, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో తొలి సారి చేపట్టిన టీజీ పీఈసెట్‌ను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం సూచించారు. యూనివర్సిటీలో కొనసాగుతున్న టీజీ పీఈసెట్‌లో రెండవ రోజు గురువారం ఆయనతో పాటు రాష్ట్ర ఉన్నత విద్యామండలి రెండవ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, పీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్, రిజిస్ట్రార్ రమేశ్ బాబులతో కలిసి ఎంపికల ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌తో స్పోర్ట్స్ హబ్‌గా మారిందన్నారు. యూనివర్సిటీలో క్రీడా పోటీల నిర్వహణకు అనువైన వాతావరణం ఉందన్నారు. అనంతరం సెట్ నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, విద్యార్థుల ఎంపిక అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

370 మంది విద్యార్థులు హాజరు

టీజీ పీఈసెట్‌లో భాగంగా బీపీఎడ్ కోర్సుకు 544 మంది విద్యార్థులకు గాను 370 మంది హాజరయ్యారు. 147 మంది గైర్హాజరయ్యారని కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీపీఎడ్ కోర్సుకు 231 మంది విద్యార్థులకు గాను, 145 మంది హాజరయ్యారు. 86 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

టాస్మో ఇండియా కన్వీనర్‌గా చెన్నయ్య


టాస్మో ఇండియా కన్వీనర్‌గా ఎతిని చెన్నయ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న సుమన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ది ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజేషన్ (టాస్మో) ఇండియా కన్వీనర్‌గా సీనియర్ కరాటే మాస్టర్ ఎతినె చెన్నయ్య నియమితులయ్యారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇండియా చైర్మన్, సినీ నటుడు సుమన్ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా చెన్నయ్యను ఉమ్మడి జిల్లా కరాటే మాస్టర్లు, విద్యార్థులు అభినందించారు.

అటవీశాఖ అధికారులకు నెమలి అప్పగింత


అటవీశాఖ అధికారికి నెమలిని అప్పగిస్తున్న రైతులు

వెల్దండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : గాయపడి నడవలేని స్థితిలో ఉన్న నెమలిని రైతులు కాపాడి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని నారాయణపూర్ గ్రామంలో గురువారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన రైతు బిచ్చు తన పొలంలో దుక్కి దున్నుతుండగా, గాయపడి నడవలేని స్థితిలో ఉన్న నెమలి కనిపించింది. వెంటనే దాన్ని పట్టుకొని సపర్యలు చేశాడు. మాజీ సర్పంచ్ అంజినాయక్ సహకారంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. దీంతో అక్కడికి చేరుకున్న అటవీశాఖ బీట్ అధికారి లలితకు నెమలిని అప్పగించారు. అనంతరం వారు దానికి వైద్యం చేయించారు.

ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రి ఫలితాలు విడుదల

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్


సెమిస్టర్ ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా వున్న కళాశాలల్లో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రి విద్యార్థుల మొదటి, 3వ సెమిస్టర్ ఫలితాలను గురువారం పీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు అకాడమిక్ సెట్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ ప్రవీణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మొదటి సెమిస్టర్‌లో 37.74 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 3వ సెమిస్టర్‌లో 42.11 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఫలితాలు మరింత మెరుగు పడాలని ఆకాంక్షించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు.

జిల్లా పోలీస్ కార్యాలయానికి

రాజోలి ఎస్ఐ అటాచ్

గద్వాల క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి ఎస్ఐ జగదీష్‌ను గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. రాజోలి మండలం చిన్న ధన్వాడ గ్రామానికి చెందిన ఓ దళిత కుటుంబంలో ఉన్న భూవివాదంపై ఓ కుటుంబ సభ్యుడు ఫిర్యాదు చేయగా రాజోలి ఎస్ఐ జగదీష్ సరైన విధంగా స్పందించలేదనే ఆరోపణ ఉన్నది. దీంతో బాధితుడు మూగ రాజేష్‌తో పాటు అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ రెండు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు చేపడుతున్న విచారణలో భాగంగానే రాజోలి ఎస్ఐ ని జిల్లా పోలీస్ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

గ్రామాల తరలింపునకు కసరత్తు


ఇళ్ల కొలతలను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ జలంధర్, ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్

దోమలపెంట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ అభయారణ్యంలోని గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు అటవీశాఖ కసరత్తు మొదలు పెట్టిందని దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ అన్నారు. మండలంలోని వటువర్లపల్లిలో ఇళ్లకు విలువ కట్టేందుకు ఆర్అండ్‌బీ డీఈ జలంధర్‌తో కలిసి కొలతలు వేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో మాట్లాడుతూ గతంలో అటవీశాఖ తరుపున ప్రైవేట్ సంస్థ ప్రతినిధులు కొలతలు వేశారని తెలిపారు. వాటిని నిర్ధారించేందుకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు మరోసారి పరిశీలించి, అంచనా వేయనున్నట్లు తెలిపారు. వటువర్లపల్లిలో 671 మంది స్వచ్ఛంద పునరావాసం కోరుకుంటున్నారని చెప్పారు. అదులో ఆప్షన్-1 రూ. 15 లక్షల ప్యాకేజీని 311 మంది ఎంచుకున్నారు. మరో 360 మంది ఆప్షన్-2ను కోరుకున్నారు. వారికి ప్రభుత్వం 5 ఎకరాల వ్యవసాయ భూమి, రెండు పడకల ఇల్లు నిర్మించి ఇవ్వనున్నది. ఇందుకు సంబంధించిన వసతులను పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామంలో ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో ధర్మనాయక్, పునరావాస గ్రామ కమిటీ అధ్యక్షుడు సాయిబాబు, ఎఫ్‌బీవోలు శ్వేత, శిల్ప, గ్రామస్థులు కరీం, శ్యాంసుందర్, జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విభజన రచ్చ


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాలమూరు పురపాలిక కార్పొరేషన్‌గా అవతరించడం.. 49 వార్డులనుంచి 60 డివిజన్‌లుగా రూపాంతరం చెందడం.. ఇప్పుడా డివిజన్‌లను విభజించడంతో కొత్త పంచాయతీ మొదలైంది.. డివిజన్‌ల సంఖ్య పెరగడంతో అంతకు ముందున్న వార్డుల స్వరూపం కచ్చితంగా మారిపోతుంది.. అయితే ఆ విభజన శాస్త్రీయంగా చేయకుండా అధికార యంత్రాంగం ఇష్టానుసారంగా విభజించి గ్రామాలు, కాలనీలను రెండుగా చీల్చి ఆయా గ్రామాలు, కాలనీలలో విభజన రచ్చకు తెరతీశారన్న విమర్శలు వస్తున్నాయి. ముసాయిదా నోటిఫికేషన్ వేసిన నాటినుంచి నగరంలోని ఏ కాలనీలో చూసినా ఇదే పంచాయతీ నెలకొంది. నగరంలో కొత్తగా విలీనం చేసిన దివిటిపల్లిని డివిజన్‌గా చేశారు. అయితే డివిజన్‌కు ఓట్లు తక్కువ కావడంతో ఎదిరలోని కొంతభాగం అంటే దాదాపు ఐదొందల ఓట్ల వరకు దివిటిపల్లి డివిజన్‌లో కలుపడం వల్ల తాము వెళ్లి అక్కడేందుకు కలవాలని ఎదిరను ప్రత్యేకంగా డివిజన్ చేయాలని ఎదిర వాసులు పట్టుబడుతున్నారు. ఇక జైనల్లీపూర్‌ను నగరంలో విలీనం చేయగా, దీనితో పాటు బోయపల్లి గ్రామంలోని సగభాగం, చుట్టూ ఉన్న మరికొన్ని ప్రాంతాలను జైనల్లీపూర్ డివిజన్‌లో కలుపడం వల్ల బోయపల్లి రెండుగా చీలిపోయింది. మోతీనగర్ చుట్టుపక్కల ఇదివరకు వార్డులో ఉన్న కాలనీలను రెండు, మూడు డివిజన్‌లలో కలుపడంపైనా అభ్యంతరాలు వస్తున్నాయి. అధికార పార్టీకి, ఒక వర్గానికి మేలు జరిగేలా డివిజన్‌లను విభజించారని ప్రతిపక్షాలతో పాటు బీసీ సంఘాల నుంచి ఆరోపణలు పెద్దఎత్తున వస్తున్నాయి. అభ్యంతరాల గడువు ముగిసే నాటికి 94 అభ్యంతరాలను కమిషనర్‌కు సమర్పించారు.

ఎన్నింటిని పరిష్కరిస్తారో చూడాలి?

ఫైనల్ నోటిఫికేషన్ వెలువడేనాటికి విభజనలో జరిగిన పొరపాట్లను సరిచేసి వివాదాన్ని సద్దుమణిగించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అధికార పార్టీలోనూ కొంత మంది తమ డివిజన్‌లను ఇష్టానుసారంగా విభజించారని స్థానిక ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకుంటున్నారు. నగరంలోని అన్ని డివిజన్‌లలో ప్రస్తుతం ఇదే రచ్చ నడుస్తోంది. ఎవరిని కదిలించినా విభజన లోటుపాట్లనే లేవనెత్తుతున్నారు.. నిబంధనలు పాటించలేదని వాపోతున్నారు. ప్రతిపక్షాలు మాత్రం అధికార పార్టీకి ఒక వర్గానికి అనుకూలంగా విభజన చేశారని, నిబంధలను అసలు పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారని సరిచేయకుండా న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరిస్తున్నాయి. బీజేపీ నాయకులు పద్మజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అచ్చుగట్ల అంజయ్యలు ఇప్పటికే కమిషనర్‌ను కలిసి డివిజన్‌ల విభజనలో నియమ నిబంధనలు పాటించలేదని ఫిర్యాదు చేశారు. ప్రకటించిన జాబితాలో 44, 24, 43,14 డివిజన్‌లలో చాలా అవకతవకలు జరిగాయని, హద్దుల గుర్తింపులో నిబంధనలు పాటించలేదన్నారు.

ప్రతిపక్షాలకు ఓటమి భయం: కాంగ్రెస్ నాయకుల ధ్వజం

రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే డివిజన్‌ల విభజన అశాస్త్రీయంగా ఉందని ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, సీనియర్ నాయకుడు వినోద్‌కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ప్రజలు కాంగ్రెస్‌వైపు ఆకర్షితులవుతున్నారని, ఎన్నికల్లో 60 స్థానాలనూ కాంగ్రెస్ పార్టీనే గెలుస్తుందని బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు మతిభ్రమించిందన్నారు. నిబంధనల మేరకు డివిజన్‌ల విభజన జరిగిందని, ఏమైనా అభ్యంతరాలుంటే వినతులు ఇచ్చేందుకు వారం రోజులు గడువు ఇచ్చారని, వాటిని పరిశీలించి అభ్యంతరాలు వాస్తవమే అయితే సరిచేస్తారన్నారు. అప్పటివరకు వేచి చూడకుండా ఎన్నికలకు వెళ్లే మొహం లేక ముందుగానే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.

డివిజన్‌ల విభజన అశాస్త్రీయం: బీఆర్ఎస్ నాయకుల ఆరోపణ

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే అశాస్త్రీయంగా డివిజన్‌ల విభజన చేశారని, అధికార పార్టీకి మేలు చేసేలా వాళ్లు చెప్పినట్లుగా విభజన చేశారని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ మునిసిపల్ చైర్మన్ కోరమోని నర్సింహులు పట్టణ పార్టీ అధ్యక్షుడు శివరాజు, మాజీ కౌన్సిలర్‌లు అనంతరెడ్డి, గంజి ఎంకన్నలు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న విషయాన్ని గమనించి నిబంధనలు పక్కన పెట్టి తమకు అనుకూలంగా విభజన చేసుకున్నారని ఆరోపించారు. ఇలా చేస్తే భవిష్యత్తులో అభివృద్ధికి చాలా ఇబ్బందులు వస్తాయన్నారు. అధికారులు లోపాలను సరిచేయకుంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్వ్యూ..

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

- డాక్టర్ యాకుబ్, పీహెచ్‌సీ, మానవపాడు



మానవపాడు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజన్ వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు గ్రామీణ ప్రాంతాల ప్రజలు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని మానవపాడు పీహెచ్‌సీ డాక్టర్ యాకూబ్ చెప్పారు. తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని, అనారోగ్య సమస్యలు ఉంటే ఆసుపత్రికి వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. గురువారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు.

సీజనల్ వ్యాధులు రాకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?

వాతావరణంలో మార్పులు జరుగుతున్నపుడు సీజనల్ వ్యాధులు వస్తాయి. వర్షాకాలం కావడం వల్ల ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.

ఎలాంటి వ్యాధులు వస్తాయి?

ఈ సీజన్‌లో ముఖ్యంగా తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కలుషిత నీటిని తాగడం వల్ల డయేరియా, జ్వరం, దగ్గు, జలుబు బారిన పడతాము. ముందు జాగ్రత్తలు తప్పకపాటించాలి.

దోమల వల్ల వచ్చే వ్యాధులు ఏమిటి?

వర్షాకాలంలో దోమల బెడద అధికంగా ఉంటుంది. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ ఉండకూడదు. ముఖ్యంగా వర్షంలో తడవకుండా జాగ్రత్తలు పాటించాలి.

ఆసుపత్రిలో మందులు ఉన్నాయా?

ప్రస్తుతం ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయి. అనారోగ్యం అనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రికి రావాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలను వినియోగించుకోవాలి.

న్యూస్ బాక్స్

సీడ్‌పత్తి మోసాలను చైర్మన్‌కు వివరించాలి

● ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గద్వాల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విత్తన సంస్థ చైర్మన్ కోదండరెడ్డి సమక్షంలో కలెక్టరేట్‌లో అధికారులు ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లాలోని సీడ్ పత్తి రైతులంతా హాజరుకావాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ కోరారు. గురువారం పట్టణంలోని పోరాట సమితి కార్యాలయంలో ముఖ్యనాయకులతో సమావేశం అనంతరం రంజిత్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. మూడు దశాబ్దాలకుపైగా నాణ్యమైన పత్తి విత్తనాలను ఉత్పత్తి చేస్తూ నడిగడ్డను సీడ్ హబ్‌గా గుర్తింపు తెచ్చిన రైతులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని, సీడ్ సత్తి సాగు ఒప్పందం మొదలుకుని జర్మినేషన్ టెస్ట్ వరకు ఆర్గనైజర్ల ద్వారా జరుగుతున్న మోసాలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పోరాట సమితి నాయకులు గౌని శ్రీనివాస్‌యాదవ్, కిష్టన్న, దొడ్డన్న, గోపాల్, కృష్ణ ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లా విద్య శిక్షణ సంస్థ(డైట్) కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో సైకాలజీ, సోషియాలజీ, మ్యాథమెటిక్స్ పెడగోసి, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, విజువల్ ఆర్ట్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సబ్జెక్టుల్లో అవకాశం ఉందని తెలిపారు. ఈనెల 13 నుంచి 19లోపు దరఖాస్తులను మహబూబ్‌నగర్‌లోని డైట్ కళాశాలలో సమర్పించాలని పేర్కొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్సై

అలంపూరు చౌరస్తా, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి ఎస్సై షుట్ట మహేశ్ వారంక్రితం నాగర్ కర్నూలు జిల్లా వంగూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ స్థానంలో వీఆర్‌లో ఉన్న ఆర్.శేఖర్ ఎస్ఐగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు, రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

17 దరఖాస్తుల స్వీకరణ

వడ్డేపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పైపాడు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీరభద్రప్ప మాట్లాడుతూ సదస్సుకు హాజరైన రైతుల ద్వారా 17 దరఖాస్తులు అందాయన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపతహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐలు, కార్యాలయం సిబ్బంది, ఉన్నారు.

మూడోవార్డులో సమస్యల తిష్ట

▸▸ సమస్యలకు నిలయంగా అలంపూర్ మునిసిపాలిటీ

వార్డ్ వాచ్

అలంపూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అలంపూరు మునిసిపాలిటీలోని మూడో వార్డులో ఎక్కడి సమస్యలు అక్కడే ఏళ్ల తరబడి తిష్టవేశాయి. కనీస సౌకర్యాలకు నోచుకోక కాలనీవాసులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడో వార్డులో లింకువీధిలోని కరెంటు స్తంభానికి షార్ట్ సర్క్యూట్ వస్తోంది. తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయి. ఈసమస్యలపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు తెలిపారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఎక్కడ పడితే అక్కడ పారుతున్నదని, సీసీరోడ్లు కూడా నిర్మించకపోవడంతో ఏళ్లుగా బురదరోడ్లపై తిరుగుతున్నామని, అయినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం నిత్యం అవస్థలు పడుతున్నా. అధికారులు, స్థానిక నాయకులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, పారిశుధ్య చర్యలు సరిగా చేపట్టకపోవడం వల్ల దారుణ పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోతున్నారు. దుర్వాసనతోనే గడుపుతున్నామని తెలిపారు.



మూడవ వార్డులో సీసీరోడ్లకు నోచుకోని లింకు వీధులు



మూడో వార్డులో కూలిన పాత ఇళ్ల స్థలాల్లో పెరిగిన ముళ్లపొదలు

ప్రభుత్వ స్థలాలు కబ్జా..

మూడవ వార్డు కాలనీలో ప్రభుత్వ స్థలాలను కొందరు కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నా మునిసిపాలిటీ వారు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పాత కట్టడాలతో ఉన్న ఇళ్లస్థలాల్లో ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో పాములు, పురుగులు, దోమలతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి మిని పార్కు వంటివి ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- జంగం నాగమల్లయ్య, మూడో వార్డు

హామీలు ఇచ్చి మరిచారు..



ఎన్నికల సమయంలోనే నాయకులకు మేం గుర్తుకు వస్తాం. సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇస్తారు. గెలిచిన తర్వాత తిరిగి చూడరు. కాలనీల్లో చివరి ఇంటివరకు సమస్యలను గుర్తించి, పరిష్కరించాలనే ఆలోచన లేకుండా వివక్ష చూపడం సరికాదు. కాలనీలో ఉన్న ఒకే ఒక్క చేతిపంపు మరమ్మతు గురించి ఎవరూ పట్టించుకోకపోవడం వల్ల నిత్యం అవస్థలు పడుతున్నాం.

- శేఖరమ్మ, మూడో వార్డు

ఏ నాయకుడూ పట్టించుకోడు



కాలనీలో సమస్యలను పరిష్కరించేందుకు ఏ ఒక్క ప్రజాప్రతినిధి, అధికారి ముందుకు రావడంలేదు. తాగునీరు సమస్య, సీసీ రోడ్లు లేకపోవడం, డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడం ప్రధాన సమస్యలు. త్వరలోనే పరిష్కరిస్తామని ప్రజాప్రతినిధులు ప్రజలను మభ్య పెడుతున్నారు. ఇప్పటికైనా వీధుల్లో పర్యటించి, ప్రజల ఇబ్బందులు పరిశీలించాలి.

- సంజీవనాయుడు, మూడో వార్డు

నేడు జిల్లాకు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ రాక

● కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాలన్యూటౌన్, జూన్12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ బీఎం సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గద్వాల మండల పరిధిలోని పుటాన్‌పల్లిలో సాగుపత్తి విత్తనాల పంటలపై ఉత్పత్తి సంబంధిత క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించి, రైతుల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి చైర్మన్ గ్రామాన్ని సందర్శించి, రైతులతో ముఖాముఖి చర్చించనున్నారన తెలిపారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో విత్తనపత్తి పంటకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి, వాటికి పరిష్కారానికి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమావేశానికి జిల్లాలోని రైతులు, విత్తన సంస్థల ప్రతినిధులు, విత్తన ఆర్గనైజర్లు హాజరై తమ సమస్యలపై కమిషన్‌కు వినతిపత్రాలు అందించవచ్చని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.ప్రేమలత



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. ప్రేమలత

గద్వాల క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను గద్వాల జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఎన్.ప్రేమలత అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీనివాస్‌తో కలిసి జాతీయ లోక్‌అదాలత్‌పై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు, సత్వర న్యాయం పొందవచ్చన్నారు. లోక్ అదాలత్ ప్రతీరోజు అందుబాటులో ఉంటుందని, ప్రజలు తమ సమస్యలను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంప్రదించాలన్నారు.

శిక్షణతో సృజనాత్మకతకు బాటలు

● ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

● ముగిసిన ఉచిత నృత్యశిక్షణ తరగతులు

గద్వాలటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉచిత శిక్షణనివ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అన్నారు. స్థానిక ప్రిన్స్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో 14ఏళ్ల లోపు చిన్నారులకు పట్టణంలోని సరస్వతి ఉన్నత పాఠశాలలో వేసవి సందర్భంగా ఉచిత నృత్యశిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరం ముగింపు సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బండ్ల జ్యోతి, నిర్వాహకులను, శిక్షణ పొందిన చిన్నారులను అభినందించారు. అనంతరం శిక్షణలో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు, పాల్గొన్న వారందరికీ ధ్రువపత్రాలను అందజేశారు. నిర్వాహకులకు తోడ్పాటునందించిన గద్వాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ రామేశ్వరమ్మ, కురుమన్న దంపతులను అభినందించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, ఇతర కళలపై శిక్షణ ఇచ్చినట్లు స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు గిరిబాబు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది వరలక్ష్మి, జమ్ములమ్మ ఆలయకమిటీ చైర్మన్ రాధమ్మ, సరస్వతి విద్యామందిర్ కరస్పాండెంట్ మాకం బీచుపల్లి, సీనియర్ కళాకారుడు శ్రీనివాసులు, కళాకారులు రాధిక, శోభిత, నాయకులు శివకుమార్, ఆనంద్, జమ్మన్న, శివ, రమేశ్, బద్రి, లక్ష్మన్న, చిన్న, మహేందర్, అరవింద్, అశోక్ ఉన్నారు.

సీడ్ ఆర్గనైజర్లు, కంపెనీల దోపిడీ అరికట్టాలి

● పత్తి రైతులకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ

● కేటీఆర్ చొరవతోనే రైతు కమిషన్ గద్వాలకు

● విలేకరుల సమావేశంలో డాక్టర్ కురువ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కురువ విజయ్ కుమార్

గద్వాల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నడిగడ్డలో సీడ్ పత్తి రైతులు నిలువు దోపిడీకి గురు అవుతున్నారు. సీడ్ ఆర్గనైజర్లు, కంపెనీల చేతిలో చిక్కి రోడ్డు పాలవడంతో పాటు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీరి దోపిడీని అరికట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ కురువ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం గద్వాలలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీడ్ ఆర్గనైజర్లు పెట్టుబడి పేరుతో అప్పులు ఇచ్చి అధిక వడ్డీని వసూళ్లు చేయడంతో పాటు పాస్ అయిన సీడ్‌ను ఫెయిల్ అయినట్లు చూపించి రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు.

ఫెయిల్ అయిన సీడ్‌ను ప్రయివేటు ల్యాబ్‌లో పరీక్షిస్తే పాస్ అయినట్లు తేలుతుందని దీనిని బట్టిచూస్తే ఎంత దోపిడి జరుగుతుందో తెలుస్తుందని ఆయన వివరించారు. దీని విషయంపై గత మంగళవారం రాష్ట్ర రైతు సంక్షేమం కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని కలిసి రైతులు తమ గోడును వెళ్లగక్కారని వివరించారు. రైతుల గోడును ఆలకించిన చైర్మన్ శుక్రవారం గద్వాల జిల్లాలో పర్యటిస్తున్నారని వివరించారు. అంతేకాకుండా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి హరీశ్‌రావు అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, కలెక్టర్ బీఎం సంతోష్‌తో మాట్లాడారని వివరించారు.

వారి చొరవతో రైతు కమిషన్ గద్వాలలో సీడ్ కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు, రైతులతో సమావేశం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని వివరించారు. ప్రధానంగా వడ్డీలు లేకుండా పెట్టుబడిని ఇవ్వాలి, సీడ్ పరీక్షలు అగ్రికల్చర్ ల్యాబ్‌లో చేయాలి, సీడ్ ధరను ఏకపక్షంగా తగ్గించరాదు అనే డిమాండ్లతో పాటు సీడ్ కంపెనీలు మోసం చేస్తే చర్యలు తీసుకునే విధంగా విత్తన చట్టంలో మార్పులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు కమిషన్ ముందుకు సీడ్ పత్తి రైతులు హాజరై మీకు జరిగిన అన్యాయాన్ని నిర్భయంగా కమీషన్ ముందు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ముద్ద తిమ్మప్ప, నర్సింహులు, గుడిసె ఆంజనేయులు, డోలు కృష్ణ, శివ, డీకే ఆంజనేయులు, అంజి, గోవిందు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరగాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

గద్వాల న్యూటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు జరిగేలా వైద్యసిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యసిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గర్భిణికి కచ్చితంగా మొదటి త్రైమాసికంలోని రిజిస్ట్రేషన్ చేసి సేవలందించాలన్నారు. వైద్యసిబ్బంది ప్రతీరోజు విధులకు హాజరుకావాలని, అన్ని రకాల వైద్యసేవలను నిత్యం ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని, ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచించారు.సమావేశంలో డాక్టర్లు రాజు, ప్రసూనారాణి, వైద్యసిబ్బంది మధుసూదన్‌రెడ్డి, వరలక్ష్మి, తిరుమలేశ్‌రెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.

అయిజలో భారీ వర్షం



అయిజలోని ఓ కాలనీలో నిలిచిపోయిన వర్షం నీరు

అయిజ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అయిజలో భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రి 11:30 నిమిషాలకు ప్రారంభమై దాదాపు 1:30 నిమిషాల వరకు కొనసాగింది. చిన్నపాటిగా వాగులు, వంకలు పొంగిపారాయి. రహదారులు కోతకు గురయ్యాయి. వీధుల్లో వర్షం నీరు నిలిచింది. అయిజలో 48.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

ఘోర విమాన ప్రమాదం దురదృష్టకరం

● మృతులకు నివాళి అర్పించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం దురదుష్టకరమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 242 మంది ప్రయాణికులతో బయలుదేరిన విమానం ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్న బీజే మెడికల్ కాలేజీపై పడిందన్నారు.

ఈ ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానితో పాటు మెడికల్ విద్యార్థులు, మహిళలు, చిన్నారులు, విదేశీయులు పెద్దమొత్తంలో మృత్యువాతపడటం దురదృష్టకరమన్నారు. మృతులకు నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కారాదని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి

రాజోలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రెండు ఆవులు చనిపోయాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని తూర్పు గార్లపాడు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బి. రామచంద్ర గురువారం ఆవులను మేపేందుకు పొలానికి తీసుకెళ్లాడు. అవి మేస్తుండగా విద్యుత్ తీగలకు తగిలి రెండు ఆవులు చనిపోయాయి. వాటి విలువ రూ. 60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

జిల్లా కేంద్రంలో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కాలనీలో ఉన్న భరోసా, షీటీం, సఖి కేంద్రాలను గురువారం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆకస్మికంగా సందర్శించి కేంద్రాల నిర్వహణ, సిబ్బంది విధులను పరిశీలించారు. అందులో భాగంగా భరోసా కేంద్రాన్ని సందర్శించి కాన్ఫరెన్స్‌హాల్, డైనింగ్, మెడికల్ రూమ్, సపోర్ట్ పర్సన్, స్టేట్‌మెంట్ రికార్డు, కౌన్సెలింగ్ రూమ్‌లను పరిశీలించి భరోసా సిబ్బంది పనితీరును, రోజు వారి కేసుల గురించి తెలుసుకున్నారు. లైంగిక వేధింపులకు గురై భరోసా కేంద్రానికి వచ్చే బాధితులకు ఒకే గొడుగు క్రింద అన్ని సేవలు నిర్ణీత సమయంలో అందించాలన్నారు. అలాగే షీటీం కేంద్రాన్ని సందర్శించి రిసెప్షన్, కౌన్సెలింగ్, రైటర్‌రూమ్, రికార్డులను పరిశీలించారు. విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో ప్రతీరోజు ఒక చోట అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గుర్తించిన హాట్ స్పాట్స్‌లలో పకడ్బందీగా నిఘా ఉంచాలన్నారు. అనంతరం సఖి కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది విధులను పరిశీలించారు. అక్కడ బాధిత మహిళలకు అందిస్తున్న వసతి, భోజనం ఏర్పాట్లు, అందుతున్న కౌన్సెలింగ్, కేసులు తదితర అంశాలపై ఇన్‌చార్జి అధికారి శోభను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట సీఐ టంగుటూరి శ్రీను, గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, భరోసా, షీటీం ఎస్ఐ స్వాతి, కోర్డినేటర్ శివాని, సఖి ఇన్‌చార్జి శోభా, సిబ్బంది ఉన్నారు.

ఫిట్‌నెస్‌లేని బస్సులు సీజ్ చేయాలి

▸▸ ఆర్టీవోను కోరిన పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు దానయ్య



ఆర్టీవోకు ఫిర్యాదు చేస్తున్న పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు దానయ్య

గద్వాల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రయివేటు స్కూల్ బస్సులపై నిఘా ఉంచి ఫిట్‌నెస్ లేని బస్సులను వెంటనే సీజ్ చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బీరెల్లి దానయ్య గురువారం ఆర్టీవో వెంకటేశ్వర్‌రావును కోరారు. ప్రతి ఏడాది మే నెలలోనే స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ చేయించాల్సి ఉండగా గడువు దాటినప్పటికీ కొందరు యజమానులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోలేదని ఆయన ఫిర్యాదు చేశారు.

ఫిట్‌నెస్ లేని బస్సులకు సర్టిఫికెట్ జారీ చేయవద్దని, విద్యార్థుల ప్రాణాలతో ఎవరూ చెలగాటమాడరాదని ఆయన విజ్ఞప్తి చేశారు. స్కూల్ బస్సులకు ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్, మిడిల్ రాడ్స్, విండోస్‌కు జాలీ ఉండాల్సిఉండగా చాలా బస్సులకు ఇవి కనిపించడం లేదని పేర్కొన్నారు. పాతబస్సులకు రంగులు అద్ది తల్లిదండ్రులను, అధికారులను మభ్యపెడుతున్నారని వివరించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ధరూర్ మండల పరిధిలోని మల్‌దొడ్డి గ్రామానికి చెందిన ఉలిగమ్మకు చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుండి మంజూరు అయిన రూ. 19వేల చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, నాయకులు విక్రమ్‌సింహారెడ్డి, రంగస్వామి, అంజిసాగర్ ఉన్నారు.

వైభవంగా శ్రీ వైకుంఠ నారాయణ స్వామి పుష్పరథ ఊరేగింపు

రాజోలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైకుంఠ నారాయణ స్వామి, శ్రీదేవి, భుదేవి సమేత కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 10గంటల సాంస్కృతిక కార్యక్రమాలు, మంగళ వాయిద్యాలతో గురువారం ఉదయం వరకు పుష్పరథంపై స్వామివారి ఊరేగించారు. కార్యక్రమంలో చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దాడి ఘటనపై విచారణ

గద్వాల క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో పాల్వాయికు చెందిన యువకుడిపై దాడి చేసిన సంఘటనలో పోలీసులపై కూడా దౌర్జన్యం చేయడంతో పాటు వారి విధులకు ఆటంకం కల్గించడంతో కానిస్టేబుల్ పాలాక్షిరెడ్డి ఫిర్యాదు మేరకు గురువారం ఈ విషయాలపై ఎంక్వయిరీ అధికారి, సీఐ టంగుటూరి శ్రీను పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్లు గురువారం ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన చాంబర్‌లో గురువారం మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన 8మందిపై కేసు నమోదు చేయడంతో పాటు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామన్నారు. వారు సేవించిన కల్లులో మోతాదుకు మించి మత్తు ఎక్కువగా ఉందన్నారు. వారు కేవలం కల్లు మాత్రమే సేవించారా.. లేక లిక్కర్ కూడా సేవించారా అనే విషయాలపై పూర్తిస్థాయిలో ఆరా తీస్తున్నామన్నారు.

మెడికల్ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

గద్వాల క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అయిజ, గద్వాల పట్టణంలోని మెడికల్ దుకాణాలపై గురువారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. డాక్టర్ సూచన లేకుండా, ఫార్మాసిస్ట్ లేకుండా ప్రజలకు యాంటిబయాటిక్స్ మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అర్హత లేని డాక్టర్లు విచక్షణ లేకుండా ప్రజలకు యాంటిబయాటిక్స్ ఇవ్వకూడదని హెచ్చరించారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటిబయాటిక్స్ ఇవ్వడం వల్ల మందులు పనిచేయవన్నారు. యాంటిబయాటిక్స్, హబిట్ ఫార్మింగ్ వంటి మెడిసన్లు తప్పనిసరిగా డాక్టర్ సూచనలతోనే ఇవ్వాలని మెడికల్ దుకాణాదారులకు హెచ్చరించారు. వినియోగదారులకు కూడా తప్పనిసరిగా బిల్ లేకుండా ఎలాంటి మందులు కొనుగోలు చేయరాదని సూచించారు.

భూ భారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారం

● జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



చింతరేవుల గ్రామసభలో ఫిర్యాదుల నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

ధరూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంతోనే రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. గ్రామాల పరిధిలోని ప్రతిఒక్కరూ భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ భల్లో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. గురువారం ధరూర్ మండలం చింతరేవులలో నిర్వహించిన భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సులో జిల్లా అదనపు పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుల నమోదు వివరాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రజల ద్వారా అందే దరఖాస్తులను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం మాట్లాడిన జిల్లా అదనపు కలెక్టర్, భూములపై రైతులకు పూర్తి హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. అన్నిరాకల భూ సమస్యలకు భూ భారత చట్టం పరిష్కారం చూపుతుందన్నారు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దా ర్ నరేందర్, రెవెన్యూ సిబ్బంది, ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థ రహిత జిల్లాగా మార్చాలి

గద్వాల న్యూటౌన్ : బాలకార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి, గద్వాల జిల్లాను బాలకార్మిక రహిత ప్రాంతంగా మార్చే దిశగా పనిచేయాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం ఐడీవోసీ లోని తన ఛాంబర్‌లో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లా కార్మిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలలకు ఉజ్వల భవిష్యత్తు కల్పించడం మనందరి బాధ్యత అన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా బాలలు కార్మికులుగా మారుతున్నారని, అటువంటి వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరు తమవంతుగా కృషి చేయాలన్నారు. బాల్యాన్ని పరిరక్షించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని సంబంధిత శాఖలు, యంత్రాంగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి సునంద, డీసీపీవో నరసింహులు, అధికారులు ఉన్నారు.